క్లుప్తంగా

మంత్రి, ఎంపీ పరామర్శ



పొదలకూరు : మండలంలోని మరుపూరుకు చెందిన వైస్ ఎంపీపీ వేణుంబాక చంద్రశేఖర్‌రెడ్డిని వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, తిరుపతి ఎంపీ ఎం.గురుమూర్తి మంగళవారం రాత్రి పరామర్శించారు. చంద్రశేఖర్‌రెడ్డి కొద్దిరోజులుగా ఆరోగ్య సమస్యలతో బాధపడుతూ ఇంటి వద్దే ఉంటున్నారు. మరుపూరు ఎన్నికల ప్రచారానికి వెళ్లిన మంత్రి, ఎంపీలు ప్రచారం పూర్తి చేసుకుని వైస్ ఎంపీపీ వద్దకు వెళ్లి పరామర్శించారు. జాగ్రత్తగా తీసుకోవాల్సిందిగా సూచించారు.

124 పోస్టల్ బ్యాలెట్ ఓట్ల పోల్

వెంకటాచలం: సర్వేపల్లి నియోజకవర్గానికి సంబంధించి వెంకటాచలంలో 124 మంది ఉద్యోగులు బుధవారం పోస్టల్ బ్యాలెట్ రూపంలో తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. నాలుగు రోజులకు గానూ మొత్తం 1,379 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మిగిలిన ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు అధికారులు గురువారం కూడా అవకాశం కల్పించారు.

తల్లీకుమారుడి మృతి

సంగం : మండలంలోని దువ్వూరులో ఓ ఇంట్లో తల్లి, కుమారుడు రెండు రోజుల క్రితం మృతిచెందగా ఆలస్యంగా బుధవారం వెలుగుచూసింది. స్థానికులు వివరాల మేరకు.. దువ్వూరుకు చెందిన రమణమ్మ (80), ఆమె కుమారుడు శ్రీనివాసులురెడ్డి (60) ఒకే ఇంట్లో నివాసం ఉంటున్నారు. శ్రీనివాసులు అవివాహితుడు కావడంతో తల్లి వద్దనే ఉంటున్నాడు. కాగా రమణమ్మ పక్షవాతంతో బాధపడుతున్నారు. ఈ క్రమంలో సోమవారం రాత్రి నుంచి వారు ఇంటి నుంచి బయటకు రాకపోవడంతో స్థానికులు మంగళవారం రాత్రి ఇంటి తలుపు చూసి చూడగా మృతి చెంది ఉన్నారు. దీంతో దూరప్రాంతాల్లో ఉన్న రమణమ్మ కుమార్తెకు సమాచారం ఇచ్చి బుధవారం ఇరువురిని ఖననం చేశారు. పక్షవాతంతో బాధపడుతున్న రమణమ్మ, ఆమె కుమారుడు శ్రీనివాసులురెడ్డి ఒకేసారి వడదెబ్బతో మృతిచెంది ఉంటారని స్థానికులు చెబుతున్నారు.

పింఛన్ టెన్షన్‌తో వృద్ధురాలి మృతి

- బ్యాంకుల చుట్టూ తిరుగుతూ..

ఆత్మకూరు : గత ఐదు రోజులుగా పింఛన్ అందక బ్యాంకుల చుట్టూ తిరుగుతూ ఓ వృద్ధురాలి గుండె ఆగింది. ఆత్మకూరు సమీపంలోని టిడ్కో ఇంట్లో ఉంటున్న లక్ష్మమ్మ (68)కు ప్రతినెలా వలంటీర్ వచ్చి పింఛన్ ఇచ్చేవాడు. ఈనెల పింఛన్ బ్యాంక్ ఖాతాలో వేశారని చెప్పడంతో ఐదు రోజులుగా బ్యాంకు చుట్టూ తిరుగుతోంది. అక్కడ పింఛన్ జమ కాలేదని తెలుసుకుని తీవ్ర ఆవేదనకు గురైంది. ఇదే ఆందోళనతో ఆమె బుధవారం తెల్లవారుజామున మృతి చెందినట్లు ఆమె కుమార్తె తెలిపింది. విషయం తెలుసుకున్న వార్డు కౌన్సిలర్ సయ్యద్ నౌషాద్‌బేగం, భర్త సయ్యద్ జమీర్ బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.



ప్రచార కార్యక్రమానికి విశేషంగా తరలివచ్చిన ప్రజలు



మంత్రి కాకాణి, ఎంపీ గురుమూర్తిలకు గజమాలతో స్వాగతం పలుకుతున్న కార్యకర్తలు

సీఎం జగన్‌తోనే రాష్ట్రాభివృద్ధి

- రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

మనుబోలు : సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి తెలిపారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మంత్రి కాకాణి మనుబోలు మండల కేంద్రంలో బుధవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా అడుగడుగునా అభిమానులు, ప్రజలు, కార్యకర్తలు వైఎస్సార్‌సీపీ జెండాలతో కాకాణికి బ్రహ్మరథం పట్టారు. గజమాలతో ఘన స్వాగతం పలికారు. అనంతరం జరిగిన బహిరంగ సభలో కాకాణి మాట్లాడారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఐదేళ్ల పదవీ కాలంలో ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చారన్నారు. వలంటీర్ వ్యవస్థ ద్వారా సంక్షేమ పథకాలను నేరుగా లబ్ధిదారుల ఇంటికి అందించిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డిది అని తెలియజేశారు. ప్రజలకిచ్చిన ప్రతి హామీని నిలబెట్టుకున్నారు కాబట్టే మీకు మంచి జరిగిందనిపిస్తేనే నాకు ఓటు వేయండి అని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అడుగుతున్నట్లు తెలిపారు. 2014 ఎన్నికల్లో 600లకు పైగా హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన చంద్రబాబు వాటిలో ఆరు హామీలను కూడా అమలు చేయలేదన్నారు. చంద్రబాబు ఇప్పుడు కొత్తగా రాజకీయాల్లోకి వచ్చినట్లుగా తాను వస్తే మీకు మేలు చేస్తానని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని నిలబెట్టుకున్న ముఖ్యమంత్రి ఒక వైపు, ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి ప్రజలను నిత్యం వంచించే చంద్రబాబు మరో వైపు ఉన్నారని, ఎవరు కావాలో ప్రజలే ఆలోచించి నిర్ణయం తీసుకోవాలని తెలిపారు. నేను, సోమిరెడ్డి ఇద్దరం వ్యవసాయ శాఖ మంత్రులుగా పనిచేశామని, అయితే సోమిరెడ్డికి నోట్లు, ఓట్లు యావే తప్ప రైతుల గోడు పట్టదన్నారు. సోమిరెడ్డి మిల్లర్లతో కుమ్మక్కవడం వల్లే గతంలో ధాన్యానికి గిట్టుబాటు ధర లభించక రైతులు తీవ్రంగా నష్టపోయారని తెలిపారు. ఇతర జిల్లాల నుంచి మిల్లర్లను రానివ్వకుండా రకరకాల సాకులతో అడ్డుకున్నాడని ఆరోపించారు. దీంతో జిల్లాలో ఉన్న మిల్లర్లు కుమ్మక్కై తక్కువ ధరకు రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేశారని తెలిపారు. తాను వ్యవసాయ శాఖ మంత్రి అయ్యాక మిల్లర్లను దూరం పెట్టి పారదర్శకంగా వ్యవహరించడం వల్లే ధాన్యానికి ఎన్నడూ లేనంత ధర లభించిందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నేతలు మన్నెమాల సుధీర్‌రెడ్డి, మారంరెడ్డి ప్రదీప్‌రెడ్డి, యూఎల్ఎస్‌రెడ్డి, మహేంద్రవర్మ, భాస్కర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, దయాకర్, రఫీ, రమేష్, కోటేశ్వరగౌడ్, కేవీఆర్‌గౌడ్, రమణయ్య, గిరి తదితరులు పాల్గొన్నారు.

సేవకుడిగా ఉంటా.. గెలిపించండి



మాట్లాడుతున్న ప్రసన్నకుమార్‌రెడ్డి

- వేమిరెడ్డికి బుద్ధి చెప్పండి
- కోవూరు ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి

కోవూరు : గడిచిన ఐదేళ్లలో నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండి సేవలు అందించానని, మరో ఐదేళ్లు సేవకుడిగా చేసుకునేందుకు ఆశీర్వదించాలని కోవూరు ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి కోరారు. కోవూరులోని వేగూరులో బుధవారం ఆయన రోడ్‌షో నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలు ఎమ్మెల్యేకు అడుగడుగునా ఘన స్వాగతం లభించింది. అనంతరం ప్రసన్న మాట్లాడుతూ.. రానున్న ఎన్నికలను టీడీపీ క్యాష్ వార్ చేసేందుకు ప్రయత్నిస్తోందని, వారు విజయం కోసం రూ.కోట్లలో ఖర్చు చేస్తున్నట్లు తెలిపారు. ప్రజలు వారి మాయలో పడవద్దని, వారికి తగిన బుద్ధి చెప్పాలన్నారు. వేగూరు సచివాలయ పరిధిలో ప్రజల సంక్షేమానికి దాదాపు రూ.33 కోట్లను ప్రభుత్వం ఖర్చు చేసిందన్నారు. గ్రామంలో రోడ్లు, డ్రైయిన్ల నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. కోవూరు నియోజకవర్గంలో నల్లపరెడ్డి కుటుంబం 11 సార్లు ఎన్నికల్లో పోటీ చేస్తే.. తొమ్మిది సార్లు గెలిపించారని తెలిపారు. తమ హయాంలో కోవూరు నియోజకవర్గాన్ని ఎంతో అభివృద్ధి చేసి చూపించామన్నారు. నియోజకవర్గంలో అభివృద్ధి లేదని వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. రాబోయే ఎన్నికల్లో వేమిరెడ్డి దంపతులకు సరైన గుణపాఠం చెప్పడానికి కోవూరు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. అభివృద్ధి, సంక్షేమం కోసం ఎంపీగా విజయసాయిరెడ్డిని, ఎమ్మెల్యేగా తనను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీఏఏబీ చైర్మన్ నిరంజన్‌బాబురెడ్డి, ఏఎంసీ చైర్మన్ రాధాకృష్ణారెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు శ్రీలత, వైఎస్సార్‌సీపీ నేతలు శ్యాంసుందర్‌రెడ్డి, గోపాలరెడ్డి, మహేష్, గున్నం జనార్ధన్, సచివాలయ కన్వీనర్ ప్రసాద్, మహిళలు పాల్గొన్నారు.

ఉచిత కంటివైద్య శిబిరం

ముత్తుకూరు : కృష్ణపట్నంలోని దామోదరం సంజీవయ్య థర్మల్ పవర్ స్టేషన్‌లో నెల్లూరు సుశీల నేత్రాలయ ఆస్పత్రి వారు బుధవారం ఉచిత కంటి వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేశారు. డాక్టర్ రాఘవ ప్రీతం ఆధ్వర్యంలో పవర్ స్టేషన్ చీఫ్ ఇంజినీర్ సుధీర్‌బాబు ఈ వైద్యశిబిరాన్ని ప్రారంభించి, కంటి పరీక్షలు చేయించుకున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు కంటివైద్య శిబిరం జరిగింది. మొత్తం ఉద్యోగులు, కార్మికులు కలిపి 527 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు.



సీఈ సుధీర్‌బాబుకు కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

11వ తేదీ వరకే ప్రచారానికి అనుమతి

నెల్లూరు(బారకాసు): ఎన్నికల ప్రచారానికి సంబంధించి ఈ నెల 11వ తేదీ సాయంత్రం 6 గంటల వరకే అనుమతి ఉంటుందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎం.హరినారాయణన్ తెలిపారు. బుధవారం నగరపాలక సంస్థ కార్యాలయ ప్రాంగణంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్ భవనంలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలింగ్‌కు 48 గంటల ముందు భారత ఎన్నికల సంఘం పేర్కొన్న అన్ని నిబంధనలను రాజకీయ పార్టీల అభ్యర్థులు తప్పకుండా పాటించాలన్నారు. ఈ నెల 11వ తేదీ సాయంత్రం 6 గంటల వరకు ప్రచారానికి అనుమతి ఉంటుందని, ఆ తరువాత మైకులు, జనం లేకుండా కేవలం నలుగురితో మాత్రమే ఇంటింటికీ వెళ్లి సైలెంట్‌గా ప్రచారం చేసుకోవాలన్నారు. బయటి నియోజకవర్గాల నుంచి వచ్చిన వారు జిల్లాను విడిచివెళ్లాలని, అన్ని కల్యాణ మండపాలు, లాడ్జీల్లో ముమ్మరంగా తనిఖీలు చేపడతామని తెలిపారు. ఎలక్ట్రానిక్, సోషల్ మీడియాల్లో ఎలాంటి ప్రకటనలు ఇవ్వకూడదని, పత్రికల్లో మాత్రం ముందస్తుగా అనుమతి పొంది ప్రకటనలు ఇవ్వవచ్చని తెలిపారు. పోలింగ్ ఏజెంట్ పోలింగ్ జరుగుతున్న సమయంలో ఓటరు జాబితాను తీసుకుని ఎట్టి పరిస్థితుల్లోనూ బయటకు రావడానికి వీలు లేదన్నారు. జిల్లాలో ఓటరు స్లిప్పుల పంపిణీ దాదాపుగా పూర్తయిందని, ఈ నెల 7వ తేదీ నాటికి పోస్టల్ బ్యాలెట్ ద్వారా 19,542 మంది ఉద్యోగులు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారని తెలిపారు. ఇంకా 566 మంది వినియోగించుకోవాల్సి ఉందని తెలిపారు. గురువారం కూడా అన్ని ఆర్వో కార్యాలయాల్లో ఫెసిలిటేషన్ సెంటర్లు పనిచేస్తాయని, ఇంకా పోస్టల్ బ్యాలెట్ ఓటు వేయని వారు వినియోగించుకోవాలన్నారు. అలాగే బుధవారం నుంచి రెండో విడతలో 85 సంవత్సరాలు పైబడిన వృద్ధులు, దివ్యాంగుల అనుమతి మేరకు వారి ఇంటి వద్దకే వెళ్లి అధికారులు ఓటు సేకరించే కార్యక్రమం కూడా ప్రారంభమైందని తెలిపారు. ఎన్నికలకు సంబంధించిన ప్రతి అంశాన్ని అత్యంత పారదర్శకంగా చేపడుతున్నామని, అలాగే జిల్లా యంత్రాంగం చేపడుతున్న అన్ని కార్యక్రమాల్లో రాజకీయ పార్టీల ప్రతినిధులు భాగస్వాములు కావాలని తెలిపారు.

వైఎస్సార్‌సీపీలో చేరికల పర్వం

కొడవలూరు : కోవూరు నియోజకవర్గంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరికల పర్వం కొనసాగుతోంది. మండలంలోని గౌతమ్ నగర్‌కు చెందిన 30 మంది యువకులు స్థానిక వైఎస్సార్‌సీపీ నేత నాగిరెడ్డి రమేష్ ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. స్థానిక ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి తన ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం గౌతమ్ నగర్‌లో పర్యటిస్తున్న సందర్భంగా వారికి వైఎస్సార్‌సీపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ జగన్‌మోహన్‌రెడ్డి పాలన పట్ల ఆకర్షితులైన యువకులు భారీగా పార్టీలో చేరుతున్నారన్నారు. వైఎస్సార్‌సీపీలో చేరిన యువకులు జగన్‌మోహన్‌రెడ్డిని తిరిగి ముఖ్యమంత్రిని చేసుకునేందుకు శక్తి వంచన లేకుండా కృషి చేస్తామని చెప్పడం శుభ పరిణామమన్నారు. పార్టీలో చేరిన వారికి అండగా నిలుస్తామని తెలిపారు. కార్యక్రమంలో డీసీఎమ్మెస్ చైర్మన్ వీరి చలపతిరావు, ఎంపీటీసీ పెనాక శ్రీనివాసులురెడ్డి, రిటైర్డ్ ఎస్సైలు కావలి రమణయ్య, ఉండ్రాళ్ల చిన్నయ్య, న్యాయవాది ఆత్మకూరు చెన్నయ్య, నాయకులు జి.వేణు, కళాధర్, కె.వేణు, అశోక్, భాస్కర్, వేమయ్య, తేజ తదితరులు పాల్గొన్నారు.

నేహారెడ్డి సమక్షంలో..

ఇందుకూరుపేట : మండలంలోని కొత్తూరు చింతోపు గ్రామానికి చెందిన పలువురు టీడీపీ నేతలు బుధవారం వైఎస్సార్‌సీపీ ఎంపీ అభ్యర్థి వేణుంబాక విజయసాయిరెడ్డి కుమార్తె నేహారెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. మండలంలోని కొత్తూరు చింతోపులో మాజీ ఉపసర్పంచ్ కటారి మస్తాన్, అతని అనుచరులతో కలిసి పార్టీలో చేరగా, నేహారెడ్డి వారికి పార్టీ కండువ కప్పి సాదరంగా ఆహ్వానించారు. తొలుత గ్రామంలో నేహారెడ్డి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన మేనిఫెస్టో గురించి తెలియజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా వినూత్న సంక్షేమ పథకాలను అమలు చేసిన ఘనత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. కుల, మత, పార్టీలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలను అందజేశారన్నారు. మరోసారి అవకాశం కల్పిస్తే జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రాన్ని మరింత అభివృద్ధి చేస్తారని తెలియజేశారు. ఎంపీ అభ్యర్థిగా విజయసాయిరెడ్డిని, ఎమ్మెల్యే అభ్యర్థిగా ప్రసన్నకుమార్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏపీ ఎల్‌డీఏ చైర్మన్ గొల్లపల్లి విజయ్‌కుమార్, సర్పంచ్ పెరుమారెడ్డి అరుణ, ఉప సర్పంచ్ పెరుమారెడ్డి విజయరాఘవరెడ్డి, కోటారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కొడవలూరు : పార్టీలో చేరిన యువకులతో ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి



కోవూరు : పార్టీలో చేరిన శ్రీనివాసులుతో ప్రసన్న



ఇందుకూరుపేట : వైఎస్సార్‌సీపీ కండువా వేస్తున్న నేహారెడ్డి

టీడీపీ వార్డు మెంబర్ చేరిక

కోవూరు : మండలంలోని పోతిరెడ్డిపాళెనికి చెందిన టీడీపీ వార్డు మెంబర్ శ్రీనివాసులు కోవూరు ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం వైఎస్సార్‌సీపీలో చేరారు. కోవూరులోని పచ్చిపాల రాధాకృష్ణారెడ్డి అతిథి గృహంలో ఈ మేరకు పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో నిరంజన్‌బాబురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాకాణిని గెలిపించండి

వెంకటాచలం : నిత్యం నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉంటూ, ప్రజల మనిషిగా గుర్తింపు పొందిన రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిని మరోసారి గెలిపించాలని వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మందల వెంకటశేషయ్య కోరారు. వెంకటాచలం పంచాయతీ పరిధిలోని పలు కాలనీల్లో బుధవారం ఇంటింటికీ వెళ్లి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అభివృద్ధిలో సర్వేపల్లి నియోజకవర్గ రూపరేఖలు మార్చిన వ్యక్తి కాకాణి అని తెలియజేశారు. ఎన్నికల సమయంలో మాత్రమే గ్రామాల్లో తిరిగే సోమిరెడ్డిని నమ్మవద్దని కోరారు. కరోనా కష్టకాలంలో సోమిరెడ్డి హైదరాబాద్‌లో తలదాచుకుంటే, కాకాణి గోవర్ధన్‌రెడ్డి గ్రామాల్లో తిరుగుతూ ప్రజలకు అండగా నిలిచారని తెలిపారు.

పూడిపర్తి గ్రామంలో..

మండలంలోని పూడిపర్తి గ్రామంలో వైఎస్సార్‌సీపీ నాయకుల ఆధ్వర్యంలో రెండో రోజు బుధవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి నియోజకవర్గ అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తున్న కాకాణిని ఓటు వేసి జగనన్న ప్రభుత్వానికి మద్దతుగా నిలవాలని కోరారు. ఈ ఐదేళ్లలో గ్రామంలో జరిగిన అభివృద్ధి పనులు గతంలో ఎన్నడూ జరగలేదని చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు కోడూరు కమలాకర్‌రెడ్డి, పోతిరెడ్డి శ్రీనివాసులురెడ్డి, కోడూరు రఘునాథరెడ్డి, పోచారెడ్డి శ్రీనివాసులురెడ్డి, కోడూరు శ్రీధర్‌రెడ్డి, డక్కిలి రమణయ్య, గ్రామ సర్పంచ్ డక్కిలి శ్రావణి తదితరులు పాల్గొన్నారు.

పట్టణ పరిధిలో..

పొదలకూరు : పట్టణంలోని కాకాణి నగర్, శ్రీహరికాలనీ, పద్మావతినగర్ ప్రాంతాల్లో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు బుధవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం జగన్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. పట్టణంలో మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పూర్తి చేసిన అభివృద్ధి పనులను తెలియజేశారు. పట్టణం మరింతగా అభివృద్ధి చెందాలంటే మూడో పర్యాయం కాకాణిని గెలిపించాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. ప్రచారంలో ఉప సర్పంచ్ వాకాటి శ్రీనివాసులురెడ్డి, వార్డుసభ్యులు అంజాద్, కండే వాసు, ఖాదర్, వాకాటి శివారెడ్డి, నర్ల ప్రభాకర్‌రెడ్డి, భాను, నర్ల వెంకటేశ్వరెడ్డి, నాని, సోమా గోపాల్, జనార్దన్, ఆసిఫ్, మనోహర్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.



వెంకటాచలంలో ఎన్నికల ప్రచారంలో మందల వెంకటశేషయ్య



వెంకటాచలం : పూడిపర్తిలో..

కాకాణిని గెలిపిస్తే అభివృద్ధి

తోటపల్లిగూడూరు : కాకాణి గోవర్ధన్‌రెడ్డిని గెలిపిస్తేనే సర్వేపల్లి నియోజకవర్గం అభివృద్ధి చెందుతుందని వైఎస్సార్‌సీపీ నేత తిరవళ్లూరు ఈశ్వరయ్య పేర్కొన్నారు. స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు పాపిరెడ్డిపాళెంలో బుధవారం సాయంత్రం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈశ్వరయ్య మాట్లాడుతూ మంత్రి కాకాణి సర్వేపల్లి అభివృద్ధికి ఎంతో కృషి చేశారన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు దువ్వూరు నారాయణరెడ్డి, దద్దోలు వెంకటసుబ్బయ్య, తిరవళ్లూరు వెంకటేశ్వర్లు, దద్దోలు రాధయ్య, నెల్లూరు లక్ష్మణ్, దేవయ్య, వెంకటరమణయ్య, ధర్మయ్య, మోహన్ తదితరులు పాల్గొన్నారు.



తోటపల్లిగూడూరు : పేడూరు పంచాయతీలో..

పేడూరులో..

స్థానిక నేత తిక్కవరపు సనత్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో పేడూరు పంచాయతీలో బుధవారం సాయంత్రం ఎన్నికల ప్రచారం సాగింది. ఈ సందర్భంగా సనత్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ మంత్రి కాకాణికి ఇప్పటికే రెండు దఫాలు విజయం అందించిన సర్వేపల్లి ప్రజలు మరోసారి విజయం అందించి హ్యాట్రిక్ విజయాన్ని అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు తూపిలి ఉదయ్‌కుమార్‌రెడ్డి, దేవళ్ల శ్రీనివాసులురెడ్డి, ఈదూరు రమేష్, సాదేపల్లి శ్యాంసన్, అల్లాభక్షు, శివ, సురేంద్ర, రఫీ, అలీం, కాలేషా తదితరులు పాల్గొన్నారు.



పొదలకూరు : శ్రీహరికాలనీలో..



తోటపల్లిగూడూరు : పాపిరెడ్డిపాళెం పంచాయతీలో..



పొదలకూరు : కేఆర్ఆర్ నగర్‌లో..

వైఎస్సార్‌సీపీతోనే సంక్షేమ పాలన



విడవలూరు : ఎన్నికల ప్రచారంలో రజత్‌కుమార్‌రెడ్డి, రాహిన్‌రెడ్డి



బుచ్చిరెడ్డిపాళెం రూరల్: ఎన్నికల ప్రచారంలో సునందారెడ్డి, నేహారెడ్డి తదితరులు

విడవలూరు : రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీతోనే సంక్షేమ పాలన సాధ్యమని కోవూరు యువజన విభాగం అధ్యక్షుడు నల్లపరెడ్డి రజత్‌కుమార్‌రెడ్డి అన్నారు. మండలంలోని రామతీర్థం, పాతూరు, రామలింగాపురం గ్రామాల్లో సోదరుడు రాహిన్‌కుమార్‌రెడ్డితో కలిసి బుధవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతిపక్ష నేతలు ఎన్ని కుట్రలు పన్నినా ప్రజల మనస్సులో వైఎస్ జగన్ నిలిచిపోయారన్నారు. రానున్న ఎన్నికల్లో కోవూరు ఎమ్మెల్యేగా నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డిని, నెల్లూరు ఎంపీ అభ్యర్థిగా వేణుంబాక విజయసాయిరెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, పొన్నాడి చంద్రశేఖర్, దాసరి కరుణాకర్, మురుమూడు మురళి, నెల్లూరు చెంచురత్నం, నాటారి భాస్కర్, నాటారి చంద్రయ్య, నువ్వూరు నరేష్, తంబి రామలింగయ్య, కొండూరు హరి, శ్రీహరికోట సుధాకర్, సున్నపు తిరుపతి, సున్నపు రామలింగయ్య, కాటంగారి తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపించండి

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: నగర పంచాయతీ పరిధిలోని 3, 4 వార్డుల్లో వైఎస్సార్‌సీపీ నెల్లూరు ఎంపీ అభ్యర్థి వేణుంబాక విజయసాయిరెడ్డి సతీమణి సునందారెడ్డి, కుమార్తె నేహారెడ్డి బుధవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి సంక్షేమ పథకాల గురించి వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. మే 13న జరిగే ఎన్నికల్లో ఎంపీ అభ్యర్థిగా విజయసాయిరెడ్డిని, కోవూరు ఎమ్మెల్యే అభ్యర్థిగా ప్రసన్నకుమార్‌రెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. రాష్ట్రం అన్నివిధాలా అభివృద్ధి చెందాలంటే మరోసారి వైఎస్సార్‌సీపీని గెలిపించాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు కోడూరు మధుసూదన్‌రెడ్డి, బట్టా ప్రవల్లిక తదితరులు పాల్గొన్నారు.

18వ వార్డులో..

18వ వార్డులో కౌన్సిలర్ మోర్ల జయంతి ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించి వైఎస్సార్‌సీపీని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో భరత్, పెంచలయ్య, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ రవాణా కట్టడికి చర్యలు

నెల్లూరు(క్రైమ్): నగదు, మద్యం, ఇతర ప్రలోభాలకు గురిచేసే వస్తువుల అక్రమ రవాణా కట్టడే లక్ష్యంగా పోలీసు, సెబ్ అధికారులు చర్యలు చేపట్టారు. జిల్లావ్యాప్తంగా చెక్‌పోస్టులతోపాటు అన్ని ప్రధాన కూడళ్లల్లో వాహన తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిన నాటి నుంచి జిల్లావ్యాప్తంగా సుమారు రూ.2.70 కోట్ల నగదు పట్టుబడగా, 19 వేల మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. ఎన్నికల కోడ్ ఉల్లంఘనపై 32కు పైగా కేసులు నమోదు చేశారు. ఈ నెల 13న ఎన్నికలు జరగనుండడంతో తనిఖీలు మరింత ముమ్మరం చేశారు. బుధవారం కావలి రెండో పట్టణ పరిధిలో రూ.1.01 లక్షలు, కొడవలూరు పరిధిలో రూ.1.50 లక్షల నగదు ఎలాంటి పత్రాలు లేకుండా తరలిస్తుండగా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. చేజర్లలో రూ.58,560 విలువ చేసే టీడీపీ కరపత్రాలను స్వాధీనం చేసుకున్నారు. అల్లూరులో 11, సెబ్ అధికారులు 197 మద్యం బాటిళ్లను సీజ్ చేసి నిందితులపై కేసులు నమోదు చేశారు. 1300 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశారు.